**కామెడీ కథ**

# నిప్పులేని పొగ

**ఎం.వీరేశ్వరరావు**

**"మళ్ళీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు. గ్యాస్ సిలెండర్ ధర 'వెయ్యి'కి చేరింది" అని పేపర్లో వార్త చదివి 'ఆ!' అంటూ స్పృహ తప్పాడు సుబ్బారావు తన ఇంట్లో!**

**అతని భార్య మృదుల వంటింట్లోంచి వచ్చి, "మళ్ళీ పెరిగాయా ధరలు! ఏ ప్రభుత్వం వచ్చినా ఏమున్నది గర్వకారణం! అయితే రేపటి నుండి నా పొదుపు పథకాన్ని అమలు చెయ్యాల్సిందే!" అంది దృఢనిశ్చయంతో.**

"అంటే!" అడిగాడు నెమ్మదిగా స్పృహలోకి వచ్చిన సుబ్బారావు.

"ఏముంది అరకప్పు టీ! గ్యాస్ ధర పెరిగింది కనుక గ్యాస్‌పొయ్యి మీద వంట లేదు. బొగ్గులు, కుంపటి, పుల్లలూ, పొయ్యి మళ్ళీ ప్రత్యక్షం అవుతాయి. అలా అయితే లోటు బడ్జెట్ లేకుండా ఉంటుంది" అంది మృదుల గంభీరంగా!

"నీ మాటలు అర్థం కావడం లేదు"

"రేపటినుండి అన్నీ అర్థం అవుతాయి" అంది మృదుల.

* * *

"నేను ఈరోజు బొగ్గుల కుంపటిమీద వంట చేస్తున్నా! సాయంత్రం వచ్చేటప్పుడు ఆఫీసుకు దగ్గరగా ఏమైనా ఎండు చెట్లు ఉంటే పుల్లలు తీసుకురండి. మీరు పుల్లలు తీసుకువచ్చిన సాయంత్రం వంట ప్రారంభిస్తా" అంది బొగ్గుల పొయ్యిని విసనకర్రతో విసురుతూ.

కాఫీ త్రాగుతూ ఆలోచనలో పడ్డాడు. ఎవర్ని తిట్టాలి? ప్రభుత్వాన్నా లేక భార్యనా?

"పుల్లలు తేవాలా? ఇదెక్కడి గోలరా బాబూ" అంటూ నీరసంగా ఆఫీసుకి బయలుదేరాడు.

సుబ్బారావు ఆఫీసుకి దగ్గరగా స్మశానం ఉంది. అక్కడ కొన్ని పచ్చచెట్లు, ఎండుచెట్లు ఉన్నాయి. పుల్లలు తీసుకు రావాలంటే స్మశానం లోపలికి వెళ్ళాలి. ఎవరైనా చూస్తే ఎలా ఉంటుంది అని సందేహిస్తూ చీకటిపడ్డాక ఎవరూ చూడటం లేదని నిర్ణయించుకున్నాక కొన్ని పుల్లలు విరిచి ఆఫీసు బ్యాగ్‌లో పెట్టుకొని ఇంటికి వచ్చాడు. పుల్లలతో వంట లేటు కదా! రాత్రి పదకొండు గంటలకి కాస్త ముద్ద తిని పడుకున్నాడు.

కొద్దిరోజులు గడిచిన తర్వాత...ఒక రోజు ఆఫీసులో...

"ఏం సుబ్బారావు పెండింగ్ వర్క్ వదిలేసి పెందరాళే పోతున్నావు ఎక్కడికి?" అడిగాడు సుబ్బారావు బాస్.

ఏదో ఆలోచనలో ఉండి సుబ్బారావు "పుల్లలు ఏరుకోవడానికి పోతున్నా" అని నాలిక కరుచుకున్నాడు. గొప్పగా చెప్పుకొనే పనా ఇది?

"పుల్లలు ఏరుకోవడానికా! ఎందుకు ఇంట్లో బియ్యం లేవా?" అడిగాడు సుబ్బారావు బాస్.

'ఒరే చెవిటిమేళం రేపు లంచ్ అవర్లో అంతా చెప్తాను' అని సుబ్బారావు వెళ్ళిపోతుండగా, బాస్, "అలా కుదరదు పని పూర్తిచెయ్యాల్సిందే" అని అడ్డుపడ్డాడు.

"పుల్లలు లేకపోతే నా పని పస్తులే" అని బాస్‌ని దాటుకొని వెళ్ళాడు సుబ్బారావు.

'అదేమిటి? ఇలా మాట్లాడుతాడు? పిల్లలు లేకపోతే పిస్తులా? అంటే పిల్లిని పెంచాలా?' అని ఆలోచనలోపడ్డాడు సుబ్బారావు బాస్.

* * *

స్మశానం దగ్గర సుబ్బారావుకి కానిస్టేబుల్ లక్కోజీరావు కనిపించాడు.

"ఏంటీ బాబూ! స్మశానికి వచ్చావు? ఏంటి కత?" సుబ్బారావుకి పోలీసుని చూడగానే చెమటలుపట్టాయి. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. నోరు పెగుల్చుకొని "పుల్లలకోసం" అన్నాడు.

"పుల్లల కోసమా? నా చెవిలో పువ్వులు కనిపిస్తున్నాయా? వాటం చూస్తే క్షుద్రపూజలు చేసేవాడిలా కనిపిస్తున్నావు. నిజం చెప్పు"

"క్షుద్రపూజలా? అసలు పూజలే చెయ్యను. నిజంగానే పుల్లలకోసం వచ్చానండి!"

లక్కోజీరావుకి కోపం వచ్చింది.

"నా సంగతి నీకు తెలియదు. నాకో పేరుంది. ఇన్‌స్టెంట్ లాఠీఛార్జీ లక్కోజీరావని. అనుమానం రాగానే లాఠీ వీపుమీద పడాల్సిందే! అలాంటి నేను నిన్ను మామూలుగా అడుగుతున్నానంటే నీ'లక్' అది. చెప్పు అసలు విషయం"

"నిజం అండి" జరిగిన కథ చెప్పాడు సుబ్బారావు.

లక్కోజీరావు పుల్లల్ని చూసి సుబ్బారావు ఇంటి దాకా వచ్చి స్వయంగా అతని భార్య పుల్లలతో వంట చెయ్యడం చూసి సంతృప్తి చెంది వెళ్ళిపోయాడు. మళ్ళీ స్మశానం పరిసరప్రాంతాల్లో కనిపిస్తే స్టేషన్‌లో పడేస్తానని బెదిరించి వెళ్ళిపోయాడు.

"చూడు నీ మూలంగా పోలీసు దృష్టిలో పడ్డాను. నాకసలు సినిమా పోలీసులని చూస్తేనే భయం. అలాంటిది నిజం పోలీసంటే గుండె ఆగిపోతుంది. ఏదో ఖర్చు తగ్గించుకొని గ్యాస్ వేయించుకుందాం" అన్నాడు సుబ్బారావు.

"లోటు బడ్జెట్! కేబుల్ ఖర్చు తగ్గించాలంటే 'తరుణీ తీరం' ఆరువేల ఎపిసోడ్ వరకూ చూసిన వాళ్ళకి బహుమతి ఇస్తున్నారు. కేబుల్ తీయించడానికి కుదరదు. పుల్లల వంట కంటిన్యూ కావాల్సిందే!" అంది మృదుల.

"ఏమి చేతునురా దేవుడా" నెత్తిమీద చేతులుంచుకొని ఆలోచిస్తున్నాడు సుబ్బారావు.

* * *

సుబ్బారావు క్రొత్తదారిలో నడిచి అరకిలోమీటర్ దూరంలో ఉన్న కొండ ఎక్కి పుల్లలు తెస్తున్నాడు. ఆఫీసు అయ్యాక లక్కోజీరావు కంటపడకుండా చూసుకుంటున్నాడు.

ఆరోజు సుబ్బారావు పుల్లలు ఏరుకొని వస్తుండగా వర్షం వచ్చింది. తడిసిన పుల్లలతో ఇంటికి వచ్చి బ్యాగ్ ఓమూలన పడేసి జలుబు చెయ్యడంతో 'జండూబామ్' రాసుకొని మంచం ఎక్కాడు.

మర్నాడు ఉదయం 8.30 నిముషాలు.

మృదుల తడిసిన పుల్లలతో వంట ప్రారంభించడంతో సరిగ్గా పుల్లలు కాలక పొగ బాగా వచ్చింది.

* * *

అదే సమయంలో-

'లిబర్టీ' మహిళా మండలి ప్రెసిడెంట్ తిరణాల చంద్రమతి తన సంఘ సభ్యులతో ఆ వీధిలోంచి వెడుతూ సుబ్బారావు ఇంటికేసి చూసింది. సుబ్బారావు ఇంట్లోంచి పొగరావడం కనిపించింది.

'అంటే ఆ ఇంట్లోని వ్యక్తి కట్నం తేలేదని భార్యని కిరోసిన్‌తో కాల్చి చంపుతున్నాడన్నమాట' అని చంద్రమతి మనసులో అనుకొని "పదండి ఒక స్త్రీ ఆపదలో వుంది. అటు వెడదాం" అంటూ తన వాళ్ళకి చెప్పింది. అందరూ మిడత దండులా సుబ్బారావు ఇంటిమీద పడ్డారు. వీళ్ళతో పాటు టీవీ-20 ఛానల్ యాంకర్ కంకర వరలక్ష్మి, కెమెరామెన్ కామేశం కూడా వచ్చారు.

వరలక్ష్మికి ఆత్రుతగా ఉంది మంచి న్యూస్ ఐటమ్ దొరుకుతుందని.

తలుపు తీసి సుబ్బారావు ఆడవాళ్ళని చూసి కంగారుపడ్డాడు.

"దొరికావు సుబ్బారావు రెడ్‌హేండెడ్‌గా! భార్యని కిరో

సిన్ పోసి చంపాలనుకున్నావు కదూ!" అంది చంద్రమతి.

"భార్య ఏమిటి? కిరోసిన్ ఏమిటి? ఈ గోల ఏమిటి?" చిరాకుగా చూసాడు సుబ్బారావు.

"ఎక్కడ దాచావు శవాన్ని?" అప్పుడు మృదుల బాత్ రూమ్‌లో ఉంది.

"పోండి అవతలకి! ఈ గోల ఏమిటి ఉదయాన్నే!"

"నిజం తేలేదాకా వదలం" అన్నారు లిబర్టీ సభ్యులు.

"నిజం ఏమిటి?"

"పొగరావడం నిజం కాదా?" అడిగింది చంద్రమతి.

"ఐతే" అడిగాడు సుబ్బారావు.

"నిప్పులేనిదే పొగరాదు"

"ఆ! బాగా కనిపెట్టారు కొలంబస్‌లా! పోయి పనిచూసుకోండి" అని వాళ్ళని గెంటి తలుపువెయ్యబోయాడు. కానీ లిబర్టీ సభ్యులు నినాదాలు చెయ్యడం మొదలు పెట్టారు.

"పురుష అహంకారం నశించాలి! సుబ్బారావు డౌన్ డౌన్" అని.

* * *

టీవీ ఛానల్-20లో వార్తలు ప్రారంభమయ్యాయి.

"రవి నగర్ ఏరియాలో ఉదయాన్నే 8.30 నిముషాలకి కిరోసిన్ పోసి భార్యని చంపడానికి ప్రయత్నించిన సుబ్బారావు కథనం చూద్దాం. మిగిలిన వివరాలు మా ప్రతినిధి వరలక్ష్మి ఇస్తుంది."

"ఆ! వరలక్ష్మీ సుబ్బారావు ఇంటి దగ్గర పరిస్థితి ఎలా ఉంది?"

"నా శ్రాద్ధంలా ఉంది! ప్రొద్దుట నుండి టీ కూడా త్రాగలేదు. కాళ్ళు పీకుతున్నాయి"

"ఆ! వరలక్ష్మీ నేను అడిగింది నీ పరిస్థితి కాదు. సుబ్బారావు ఇంటి దగ్గర పరిస్థితి"

చిన్న బ్రేక్! మళ్ళీ వార్తలు.

"చెప్పు వరలక్ష్మి"

"పొగరావడం నిజమే! లోపలికి వచ్చాక పొగలేదు. బహుశా పొగ వేరే దిక్కునుండి గాలిలోకి పోయి ఉంటుంది"

"పొగ గోల సరే. సుబ్బారావు ఏమంటున్నాడు?"

"సుబ్బారావు మామూలు ఎండుపుల్లల పొగ అంటున్నాడు. ఇంట్లోంచి కదలకపోతే అందర్నీ నాలుగు పీకుతానంటున్నాడు"

"వరలక్ష్మి మరిన్ని వివరాలు సంపాదించు. ఈలోగా చిన్న బ్రేక్!"

కొద్దిసేపయ్యాక.

"ఆ! లక్ష్మీ కొత్త సంగతులు తెలిసాయా?"

"ఆ! 'కాజా' ఛానల్ వాళ్ళు వచ్చారు. ఆ యాంకర్‌కి రెమ్యూనరేషన్ నాకన్నా ఎక్కువ. 'కిస్సా' ఛానల్ వాళ్ళు వచ్చారు. 'ఎస్' ఛానల్ వాళ్ళు వచ్చారు."

"నేను అడిగింది మిగతా ఛానళ్ళ గోల కాదు. సుబ్బారావు ఇంటి దగ్గర సంగతి"

"అదా! ఆడవాళ్ళు కదలకపోవడంతో, అతని మాట



నమ్మకపోవడంతో సుబ్బారావు జుట్టు పీక్కుంటున్నాడు. చూస్తుండగానే సుబ్బారావుకి బట్టతల వచ్చింది."

(సుబ్బారావు తలని 'జూమ్'లో చూపించారు టీవీ-20 వాళ్ళు)

ఆడవాళ్ళందరూ సుబ్బారావు నేరం అంగీకరించాలని గోల చేస్తున్నారు.

* * *

సరిగ్గా అదే సమయంలో బాత్‌రూమ్ నుండి బయటికి వచ్చిన మృదుల విషయం అర్థం చేసుకొని ఆడవాళ్ళకి అసలు విషయం చెప్పి ఛానల్-20 వాళ్ళకి నిజం చెప్పి పంపించేసింది.

"ఏదో పొగ, పెద్ద న్యూస్ అనుకొని వెళ్ళాను. ఛీఛీ చంద్రమతి మాటలు విని" అని నీరసంగా చెప్పింది వరలక్ష్మి.

"చివరికి అది 'నిప్పులేని పొగ', 'న్యూస్ లేని ఛానల్' అయ్యింది. క్రొత్తబిచ్చగాడు ప్రొద్దెరగడన్నట్లు యాంకర్ ఉద్యోగం రాగానే సందులు గొందులూ తిరగడం కాదు నిదానించాలి. సర్లే! 'రోడ్ మీద పూల్' ప్రోగ్రామ్ చేద్దాం పద!" అంటూ ముందుకు దారితీసాడు కామేశం.

* * *

సుబ్బారావు గ్యాస్ సమస్యకి శాశ్వత పరిష్కారం కనుక్కున్నాడు. ఓటు వేసి గెలిపించిన పార్టీని వందోసారి తిట్టుకొని, స్కూటర్, పర్సనల్ కంప్యూటర్, రిఫ్రిజిరేటర్ అమ్మి ఆ సొమ్ము బ్యాంక్‌లోవేసి, వచ్చే వడ్డీతో నెల నెలా గ్యాస్ సిలెండర్ కొనుక్కుంటున్నాడు పూర్ సుబ్బావ్!

మళ్ళీ ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. సిలెండర్ ధర మారలేదు.

'మళ్ళీ గ్యాస్ ధర పెంపు' పేపరులో వార్త చదివి మళ్ళీ స్పృహతప్పాడు సగటు సుబ్బారావు.